13-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - మొత్తం ప్రపంచమంతటిలోనూ మీ వంటి పదమాపదమ భాగ్యశాలీ విద్యార్థులు ఇంకెవరూ లేరు, మిమ్మల్ని స్వయంగా జ్ఞానసాగరుడైన తండ్రి శిక్షకునిగా అయి చదివిస్తారు"

ప్రశ్న:- ఏ అభిరుచి సదా ఉన్నట్లయితే మోహపు బంధనాలు తెగిపోతాయి?

జవాబు:- సేవ చేయాలనే అభిరుచి ఉన్నట్లయితే మోహపు బంధనాలు తెగిపోతాయి. ఈ కనుల ద్వారా ఏదైతే చూస్తున్నామో, అదంతా వినాశీ అని సదా బుద్ధిలో ఉండాలి. వీటిని చూస్తూ కూడా చూడకూడదు. తండ్రి శ్రీమతము ఏమిటంటే - చెడు వినకండి, చెడు చూడకండి...

ఓం శాంతి. మధురమైన శాలిగ్రామాలకు, ఆత్మిక పిల్లల ప్రతి శివ భగవానువాచ. మనం సత్యయుగ ఆది సనాతన పవిత్ర దేవీ-దేవతా ధర్మానికి చెందినవారిగా ఉండేవారము అన్నది పిల్లలు అర్థం చేసుకున్నారు, కావున దీనిని గుర్తుంచుకోవాలి. ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని ఎంతగానో నమ్ముతారు కానీ, దేవతా ధర్మానికి బదులుగా హిందూ ధర్మం అన్న పేరును పెట్టేసారు. ఆది సనాతనులమైన మనం ఎవరిమి అనేది మీకు తెలుసు. మళ్ళీ పునర్జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ ఈ విధంగా అయ్యాము. ఈ విషయాలను భగవంతుడు కూర్చొని అర్థం చేయిస్తారు. భగవంతుడు దేహధారీ మానవుడేమీ కారు. మిగిలినవారందరికీ తమ-తమ దేహాలు ఉన్నాయి, శివబాబాను విదేహీ అని అంటారు. వారికి తమదంటూ దేహం లేదు, కావున స్వయాన్ని కూడా ఈ విధంగా విదేహీగా భావించడం ఎంత మధురముగా అనిపిస్తుంది. మనం ఎలా ఉండేవారము, ఇప్పుడు ఎలా తయారవుతున్నాము. ఈ డ్రామా ఎలా తయారుచేయబడి ఉంది అన్నది కూడా ఇప్పుడు మీరు అర్థం చేసుకుంటారు. ఈ దేవీ-దేవతా ధర్మమే పవిత్ర గృహస్థ ఆశ్రమంగా ఉండేది. ఇప్పుడు ఆశ్రమం లేదు. ఇప్పుడు మనం ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేస్తున్నామని మీకు తెలుసు. హిందువు అన్న పేరును ఇప్పుడే పెట్టారు. ఆది సనాతన హిందూ ధర్మం అయితే లేదు. ఆది సనాతన ధర్మం వారికి అర్థం చేయించండి అని బాబా ఎన్నోసార్లు చెప్పారు. మీరు ఆది సనాతన పవిత్ర దేవీ-దేవతా ధర్మానికి చెందినవారా లేక హిందూ ధర్మానికి చెందినవారా అని ఇందులో వ్రాయండి అని చెప్పండి. తద్వారా వారికి 84 జన్మల గురించి తెలుస్తుంది. ఈ జ్ఞానం చాలా సహజమైనది. కేవలం లక్షల సంవత్సరాలు అని అనడంతో మనుష్యులు తికమకపడతారు. ఇది కూడా డ్రామాలో నిశ్చయించబడి ఉంది. సతోప్రధానము నుండి తమోప్రధానముగా అవ్వడం కూడా డ్రామాలో పాత్ర. దేవతా ధర్మం వారే 84 జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ ఎంత అశుద్ధముగా అయిపోయారు. మొదట భారత్ ఎంత ఉన్నతముగా ఉండేది. భారత్ మహిమనే చేయాలి. ఇప్పుడు మళ్ళీ తమోప్రధానము నుండి సతోప్రధానముగా, పాత ప్రపంచం నుండి కొత్త ప్రపంచముగా తప్పకుండా అవ్వనున్నది. ముమ్ముందు మీ విషయాలను తప్పకుండా అర్థం చేసుకుంటారు. వారికి చెప్పండి - ఘోరమైన నిద్ర నుండి మేల్కొనండి, తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి అని. పిల్లలైన మీకు మొత్తం రోజంతా సంతోషము ఉండాలి. మొత్తం ప్రపంచములో, మొత్తం భారత్ లో మీ వంటి పదమాపదమ భాగ్యశాలీ విద్యార్థులు ఇంకెవరూ లేరు. మేము ఏ విధముగా ఉండేవారిమో, అదే విధముగా మళ్ళీ అవుతున్నాము అని అర్థం చేసుకున్నారు. అంతా పేరు అయిన తర్వాత, మళ్ళీ వారే వెలువడుతారు, ఇందులో మీరు తికమకపడకండి. ప్రదర్శనిలో కొద్దిగా విని వెళ్ళినా కానీ, వారు కూడా ప్రజలుగా అవుతారు ఎందుకంటే అవినాశీ జ్ఞాన ధనము వినాశనమవ్వదు. రోజురోజుకూ మీ సంస్థ వేగంగా వృద్ధి చెందుతూ ఉంటుంది, అప్పుడిక లెక్కలేనంతమంది మీ వద్దకు వస్తారు. నెమ్మది-నెమ్మదిగా ధర్మ స్థాపన జరుగుతుంది. ఎవరైనా గొప్ప వ్యక్తి బయటి నుండి వస్తే, వారి ముఖాన్ని చూసేందుకు ఎంతమంది మనుష్యులు వెళ్తారు. ఇక్కడ అటువంటి విషయమేదీ లేదు. మీకు తెలుసు - ఈ ప్రపంచంలో ఏ వస్తువులైతే ఉన్నాయో, అవన్నీ వినాశీ వస్తువులే. వాటిని చూడకూడదు. చెడును చూడకండి... ఈ చెత్త భస్మమవ్వనున్నది. మనుష్యులను మొదలైనవి ఏవైతే చూస్తారో, అవన్నీ కలియుగానికి చెందినవేనని మీరు అర్థం చేసుకున్నారు. మీరు సంగమయుగ బ్రాహ్మణులు. సంగమయుగము గురించి ఎవరికీ తెలియదు. కేవలం ఈ మాత్రం గుర్తుంచుకోండి - ఇది సంగమయుగము, ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి. పవిత్రముగా కూడా తప్పకుండా అవ్వాలి. ఇప్పుడు తండ్రి అంటారు - ఈ కామ వికారము ఆదిమధ్యాంతాలు దుఃఖమిస్తుంది, దీనిని జయించండి. విషం గురించి ఎంతగా విసిగిస్తారో చూడండి. తండ్రి అంటారు - కామము మహాశత్రువు, దానిపై విజయాన్ని పొందాలి. ఇప్పుడు ఈ సమయంలో ప్రపంచంలో ఎంతమంది మనుష్యులు ఉన్నారు. మీరు ఒక్కొక్కరికి ఎంతని అర్థం చేయిస్తారు. ఒకరికి అర్థం చేయిస్తే ఇంకొకరు ఇది గారడి అని అంటారు, అప్పుడు చదువును వదిలేస్తారు అందుకే తండ్రి అంటారు - ఆది సనాతన ధర్మం వారికి అర్థం

చేయించండి. ఆదిసనాతనమైనది దేవతా ధర్మమే. ఈ లక్ష్మీ-నారాయణులు ఈ పదవిని ఎలా పొందారు, మనుష్యుల నుండి దేవతలుగా ఎలా అయ్యారు అని మీరు అర్థం చేయిస్తారు. ఇది తప్పకుండా వారి అంతిమ జన్మ అయ్యి ఉంటుంది. 84 జన్మలను పూర్తి చేసి మళ్ళీ ఈ విధంగా అయ్యారు. ఎవరికైతే సేవ పట్ల అభిరుచి ఉంటుందో, వారు తప్పకుండా ఇందులో నిమగ్నమై ఉంటారు. మిగిలిన అన్ని వైపుల నుండి మోహము తెగిపోతుంది. మనం ఈ నేత్రాల ద్వారా ఏదైతే చూస్తామో, దానినంతటినీ మర్చిపోవాలి. చూస్తూ కూడా చూడనట్లే ఉండాలి. చెడును చూడకండి... మనుష్యులు కోతుల చిత్రాలను తయారుచేస్తారు. అసలేమీ అర్థం చేసుకోరు. కుమార్తెలు ఎంతగా కష్టపడతారు. ఎవరైతే అర్థం చేయించి యోగ్యులుగా తయారుచేస్తారో, వారికి బాబా ప్రశంసిస్తారు. ఎవరైతే పని చేసి చూపిస్తారో, వారికే బహుమానం కూడా లభిస్తుంది. తండ్రి మనకు ఎంతటి బహుమతిని ఇస్తారో మీకు తెలుసు. మొదటి నంబరు సూర్యవంశీ రాజధాని యొక్క బహుమతి. రెండవ నంబరు చంద్రవంశీ రాజధాని యొక్క బహుమతి. నంబరువారుగానైతే ఉండనే ఉంటారు. భక్తి మార్గపు శాస్త్రాలను కూడా ఎన్ని కూర్చుని తయారుచేస్తారు. ఇప్పుడు తండ్రి అర్థం చేయిస్తారు - ఈ శాస్త్రాలను చదవడం ద్వారా, యజ్ఞ-తపాదులు చేయడం ద్వారా నన్ను ఎవరూ కలుసుకోరు. రోజురోజుకూ ఎంత మంది పాపాత్ములుగా అవుతూ ఉంటారు. పుణ్యాత్ములుగా ఎవరూ అవ్వలేరు. తండ్రే వచ్చి పుణ్యాత్ములుగా తయారుచేస్తారు. ఒకటేమో హద్దులోని దానపుణ్యాలు, ఇంకొకటి అనంతమైనది. భక్తి మార్గంలో పరోక్షంగా ఈశ్వరార్థం దానపుణ్యాలు చేస్తారు కానీ ఈశ్వరుడు అని ఎవరిని అంటారో తెలియనే తెలియదు. ఇప్పుడు మీకు తెలుసు. శివబాబాయే మనల్ని ఎలా ఉన్నవారిని ఎలా తయారుచేస్తారు! అని ఇప్పుడు మీరు అంటారు. భగవంతుడైతే ఒక్కరే. వారిని మళ్ళీ సర్వవ్యాపి అని అనేసారు. మీరు ఏమి చేసేసారో చూడండి అని వారికి అర్థం చేయించాలి. మీ వద్దకు వస్తారు, కొద్దిగా విని బయటకు వెళ్ళగానే సమాప్తమైపోతుంది. ఇక్కడిది ఇక్కడే ఉండిపోతుంది. అంతా మర్చిపోతారు. జ్ఞానం చాలా బాగుంది, మేము మళ్ళీ వస్తాము అని మీతో అంటారు. కానీ మోహపు బంధనాలు తెగవు. మోహజీత్ రాజు కథ ఎంత బాగుంది. ఫస్ట్ క్లాస్ మోహజీత్ రాజులు ఈ లక్ష్మీనారాయణులు. కానీ మనుష్యులు అర్థమే చేసుకోరు. ఇది ఆశ్చర్యము. రావణ రాజ్యంలో మెట్లు దిగుతూ పూర్తిగా కింద పడిపోయారు. పిల్లల ఆట ఉంటుంది కదా. పైకి వెళ్ళి మళ్ళీ కింద పడిపోతారు. మీ ఆట కూడా చాలా సహజమైనది. తండ్రి అంటారు - మంచి రీతిలో ధారణ చేయండి, ఎటువంటి అశుద్ధమైన పనీ చేయకండి.

తండ్రి అంటారు - బీజరూపుడినైన నేను సత్ చిత్ ఆనంద స్వరూపాన్ని. జ్ఞానసాగరుడను. ఇప్పుడు జ్ఞానసాగరుడు పైన కూర్చొని ఉంటారా? తప్పకుండా ఎప్పుడో ఒకప్పుడు వచ్చి జ్ఞానాన్ని ఇచ్చి ఉంటారు. జ్ఞానము అంటే ఏమిటో కూడా ఎవరికీ తెలియదు. ఇప్పుడు తండ్రి అంటారు - నేను మిమ్మల్ని చదివించేందుకు వస్తాను కావున రెగ్యులర్ గా చదవాలి. ఒక్కరోజు కూడా చదువును మిస్ చేయకూడదు. ఏదో ఒక మంచి పాయింట్ తప్పకుండా లభిస్తుంది. మురళిని చదవకపోతే తప్పకుండా పాయింట్లు మిస్ అవుతాయి. లెక్కలేనన్ని పాయింట్లు ఉన్నాయి. భారతవాసులైన మీరు ఆది సనాతన దేవీ-దేవతా ధర్మానికి చెందినవారు అని కూడా మీరు అర్థం చేయించాలి. ఇప్పుడు ఎన్ని లెక్కలేనన్ని ధర్మాలున్నాయి. మళ్ళీ చరిత్ర తప్పకుండా పునరావృతమవ్వాలి. ఇవి పైకి ఎక్కే మరియు కిందకు దిగే మెట్లు. ఏ విధంగా జిన్ను భూతానికి - మెట్లు దిగు మరియు ఎక్కు అని ఆజ్ఞను ఇచ్చారు. అలాగే మీరందరూ జిన్ను భూతాలే కదా. 84 జన్మల మెట్లను ఎక్కుతారు, మళ్ళీ దిగుతారు. ఎంత లెక్కలేనంతమంది మనుష్యులు ఉన్నారు. ప్రతి ఒక్కరూ ఎంతటి పాత్రను అభినయించాల్సి ఉంటుంది. పిల్లలకు చాలా ఆశ్చర్యం అనిపించాలి.

మీకు మొత్తం అనంతమైన నాటకము గురించి పూర్తి పరిచయం లభించింది. మొత్తం సృష్టి యొక్క ఆదిమధ్యాంతాల గురించి ఇప్పుడు మీరే తెలుసుకున్నారు. మనుష్యమాత్రులెవ్వరూ దీనిని తెలుసుకోలేరు. సత్యయుగములో ఎవరి నోటి నుండి ఎలాంటి కటు వచనాలు వెలువడవు. ఇక్కడైతే ఒకరినొకరు నిందించుకుంటూ ఉంటారు. ఇది విషయ వైతరిణీ నది, రౌరవ నరకము. మనుష్యులందరూ రౌరవ నరకములో పడి ఉన్నారు. ఇక్కడ యథా రాజా రాణి తథా ప్రజా ఉన్నారు. అంతిమంలో, ఎప్పుడైతే ఆది సనాతన దేవీ-దేవతా ధర్మ స్థాపనను ఎవరు చేసారు అన్నది అర్థం చేసుకుంటారో అప్పుడు మీకు విజయం లభించనున్నది. ఇదే మొట్టమొదటి ముఖ్యమైన విషయము, దీని గురించి ఎవరికీ తెలియదు.

తండ్రి అంటారు - నేను పేదల పాలిటి పెన్నిధిని. ఎప్పుడైతే టూ లేట్ అవుతుందో, అప్పుడు చివరిలో ఈ విషయాన్ని అర్థం చేసుకుంటారు. ఇప్పుడు మీకు మూడవ నేత్రము లభించింది. మధురమైన ఇల్లు మరియు మధురమైన రాజ్యము మీ బుద్ధిలో గుర్తున్నాయి. తండ్రి అంటారు - ఇప్పుడు శాంతిధామానికి, సుఖధామానికి వెళ్ళాలి. మీరు ఏ

పాత్రనైతే అభినయించారో, అది ఇప్పుడు మీ బుద్ధిలోకైతే వస్తుంది కదా. బ్రాహ్మణులైన మీరు తప్ప మిగిలినవారంతా మరణించి ఉన్నారు. బ్రాహ్మణులే నిలబడతారు. బ్రాహ్మణులే మళ్ళీ దేవతలుగా అవుతారు. ఈ ఒక్క ధర్మ స్థాపన జరుగుతుంది. ఇతర ధర్మాలు ఎలా స్థాపన అవుతాయో కూడా మీ బుద్ధిలో ఉంది. అర్థం చేయించేవారు ఒక్క తండ్రే. ఇటువంటి తండ్రిని ఘడియ-ఘడియ స్మృతి చేయాలి. వ్యాపారాలు మొదలైనవి చేయండి కానీ కేవలం పవిత్రముగా అవ్వండి. ఆది సనాతన దేవీ-దేవతా ధర్మం పవిత్రముగా ఉండేది, ఇప్పుడు మళ్ళీ పవిత్రముగా అవ్వాలి. నడుస్తూ-తిరుగుతూ తండ్రినైన నన్ను స్మృతి చేసినట్లయితే మీరు సతోప్రధానంగా అవుతారు. స్మృతి యాత్ర లేకుండా మీరు ఉన్నతోన్నతమైన పదవిని ఎప్పుడూ పొందలేరు. సతోప్రధానత వరకూ చేరుకున్నప్పుడే పాపాలు తొలుగుతాయి. ఇది యోగాగ్ని - ఈ పదాలు గీతలోనివి. యోగము-యోగము అంటూ కష్టపడతారు. యోగమును నేర్పించేందుకు విదేశాల నుండి కూడా చిక్కుకునేలా చేసి ఇక్కడకు తీసుకువస్తారు. ఇప్పుడు మీ విషయాన్ని ఇతరులు అర్థం చేసుకోవాలి. పరమాత్మ, సుప్రీమ్ సోల్ అయితే ఒక్కరే. వారే వచ్చి అందరినీ సుప్రీమ్ గా తయారుచేస్తారు. ఒకానొకరోజు వార్తాపత్రికల వారు ఇలాంటి విషయాలను వేస్తారు. ఇది తథ్యము. రాజయోగాన్ని పరమపిత పరమాత్మ తప్ప ఇంకెవరూ నేర్పించలేరు. ఈ విషయాలను పెద్ద-పెద్ద అక్షరాలలో వేయాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సూర్యవంశ రాజధాని యొక్క బహుమతిని తీసుకునేందుకు బాప్ దాదా యొక్క ప్రశంసలను తీసుకోవాలి. సేవ చేసి చూపించాలి. మోహపు బంధనాలను తెంచివేయాలి.

2. జ్ఞానసాగరుడు, విదేహీ అయిన తండ్రి స్వయంగా చదివించేందుకు వస్తారు కావున రోజూ చదువుకోవాలి. ఒక్కరోజు కూడా చదువును మిస్ చేయకూడదు. తండ్రి సమానముగా విదేహీగా అయ్యేందుకు పురుషార్థం చేయాలి.

వరదానము:- తమ ప్రాక్టికల్ జీవితపు ప్రమాణము ద్వారా సైలెన్స్ శక్తి యొక్క ధ్వనిని వ్యాపింపజేసే విశేషమైన సేవాధారీ భవ

ప్రతి ఒక్కరికీ సైలెన్స్ శక్తిని అనుభవము చేయించటము - ఇది విశేషమైన సేవ. ఏ విధంగా సైన్స్ శక్తి ప్రసిద్ధమైనదో, అలా సైలెన్స్ శక్తి ప్రసిద్ధమవ్వాలి. సైలెన్స్ శక్తి, సైన్స్ శక్తి కన్నా గొప్పది అని అందరి నోటి నుండి శబ్దం వెలువడాలి. ఆ రోజు కూడా రానున్నది. సైలెన్స్ శక్తి యొక్క ప్రత్యక్షత అనగా తండ్రి ప్రత్యక్షత. సైలెన్స్ శక్తి యొక్క ప్రత్యక్ష ప్రమాణము - మీ అందరి జీవితము. ప్రతి ఒక్కరూ నడుస్తూ-తిరుగుతూ ఉన్న పీస్ మోడల్స్ గా కనిపించాలి, అప్పుడు సైన్స్ వారి యొక్క దృష్టి కూడా సైలెన్స్ వారి వైపుకు వెళ్తుంది. ఇటువంటి సేవను చెయ్యండి, అప్పుడు విశేషమైన సేవాధారులు అని అంటారు.

స్లోగన్:- సేవ మరియు స్థితి యొక్క బ్యాలెన్స్ ఉంచినట్లయితే సర్వుల బ్లెసింగ్స్ (దీవెనలు) లభిస్తూ ఉంటాయి.

మాతేశ్వరిగారి అమూల్య మహావాక్యాలు

పాట:- నయనహీనునికి మార్గాన్ని చూపించండి ప్రభు...

నయనహీనునికి మార్గాన్ని చూపించండి ప్రభూ అని మనుష్యులు పాటను పాడుతారు, అనగా మార్గాన్ని చూపించేవారు ఒక్క పరమాత్మయేనని అర్థము, అప్పుడే కదా పరమాత్మను పిలుస్తారు మరియు ఎప్పుడైతే - ప్రభూ, మార్గాన్ని చూపించండి అని అంటారు, అంటే మనుష్యులకు మార్గాన్ని చూపించేందుకు స్వయం పరమాత్మ నిరాకార రూపము నుండి సాకార రూపములోకి తప్పకుండా రావలసి వస్తుంది. అప్పుడే స్థూలంగా మార్గమును చూపిస్తారు, వారు రాకుండా మార్గమును చూపించలేరు. ఇప్పుడు మనుష్యులు ఎవరైతే తికమకలో ఉన్నారో, ఆ తికమకలో ఉన్నవారికి మార్గము కావాలి అందుకే పరమాత్మను - నయనహీనునికి మార్గము చూపించండి ప్రభూ.... అని అంటారు. వీరినే మళ్ళీ నావికుడు అని కూడా అంటారు. వారు ఈ తీరము నుండి అనగా ఈ పంచ తత్వాలతో తయారైన

సృష్టి ఏదైతే ఉందో, దానిని దాటి అతీతంగా ఆవలి తీరానికి అనగా పంచ తత్వాల నుండి అతీతమైన ఆరవ తత్వము, అఖండ మహాతత్వము ఏదైతే ఉందో, అందులోకి తీసుకువెళ్తారు. కనుక పరమాత్మ కూడా ఎప్పుడైతే ఆ తీరము నుండి ఈ తీరమునకు వస్తారో, అప్పుడే కదా తీసుకువెళ్తారు. కనుక పరమాత్మకు కూడా తమ ధామము నుండి రావలసి వస్తుంది, అందుకే పరమాత్మను నావికుడు అంటారు. వారే నావలైన మనల్ని (ఆత్మా రూపీ నావను) తీరానికి తీసుకువెళ్తారు. ఇప్పుడు ఎవరైతే పరమాత్మతో యోగాన్ని జోడిస్తారో, వారిని తమతో పాటు తీసుకువెళ్తారు. ఇక ఎవరైతే మిగిలిపోతారో, వారు ధర్మరాజు శిక్షలను అనుభవించి తర్వాత ముక్తులవుతారు.

ఎప్పుడైతే మనుష్యులందరూ చాలా దుఃఖితులుగా ఉంటారో, అప్పుడు పరమాత్మను స్మృతి చేస్తారు - పరమాత్మా, ఈ ముళ్ళ ప్రపంచం నుండి పుష్పాల నీడలోకి తీసుకువెళ్ళండి అని, అంటే తప్పకుండా ఏదో ఒక ప్రపంచము ఉందని దీని ద్వారా ఋజువవుతుంది. ఇప్పటి ప్రపంచము ఏదైతే ఉందో అది ముళ్ళతో నిండి ఉందని మనుష్యులందరికీ తెలుసు. దీని కారణంగా మనుష్యులు దుఃఖము, అశాంతులను పొందుతున్నారు మరియు పుష్పాల ప్రపంచాన్ని గుర్తు చేస్తారు. అంటే తప్పకుండా వేరే ప్రపంచము ఉంది, ఆ ప్రపంచము యొక్క సంస్కారాలు ఆత్మలో నిండి ఉన్నాయి. దుఃఖము, అశాంతి - ఇవన్నీ కర్మబంధనం యొక్క లెక్కాచారాలు అని మనకు తెలుసు. రాజు నుండి నిరుపేదల వరకు మనుష్యమాత్రులు ప్రతి ఒక్కరూ ఈ లెక్కాచారములో పూర్తిగా చిక్కుకుని ఉన్నారు, అందుకే పరమాత్మ స్వయంగా ఇలా అంటారు - ఇప్పటి ఈ ప్రపంచము కలియుగము, ఇదంతా కర్మబంధనాలతో తయారై ఉంది మరియు ఇంతకుముందు ఉన్న ప్రపంచము సత్యయుగము, దానిని పుష్పాల ప్రపంచము అని అంటారు. ఇప్పుడు అది కర్మబంధన రహితమైన జీవన్ముక్త దేవీ-దేవతల రాజ్యము, అది ఇప్పుడు లేదు. జీవన్ముక్తి అని ఇప్పుడు మనమేదైతే అంటున్నామో, దాని అర్థం మనము దేహం నుండి ముక్తులుగా ఉండేవారము అని కాదు, వారికి ఎటువంటి దేహభానము ఉండేది కాదు. కానీ వారు దేహములో ఉంటూ కూడా దుఃఖాన్ని పొందేవారు కాదు, అనగా అక్కడ కర్మబంధనాల విషయమేదీ లేదు. వారు జీవితాన్ని తీసుకుంటూ, జీవితాన్ని వదులుతూ ఆది మధ్య అంతిమాలలో సుఖాన్ని పొందేవారు. జీవన్ముక్తి అంటే అర్థము - జీవిస్తూ ఉండగానే కర్మాతీతము, ఇప్పుడు ఈ మొత్తము ప్రపంచము పంచ వికారాలలో పూర్తిగా చిక్కుకుని ఉంది, అంటే పంచ వికారాలు పూర్తిగా ఉన్నాయి, కానీ ఈ పంచ భూతాలను జయించగలిగే అంతటి శక్తి మనుష్యులలో లేదు, అందుకే పరమాత్మ స్వయంగా వచ్చి మనల్ని పంచ భూతాల నుండి విడిపిస్తారు మరియు భవిష్య ప్రారబ్ధమైన దేవీ-దేవతా పదవిని ప్రాప్తి చేయిస్తారు. అచ్ఛా - ఓం శాంతి.